# విస్మృతి

("శారద" ఆగష్టు 1923)

బ్రతికి యుండగనే నూజివీటి ధర్మప్పారాయని కీర్తి బిచ్చగాండ్ర పాటలలోనను; వారు పాడుచుండ, నివ్వెర చూచు పసివారల చూపుల లోనను పరిమళించినది. "అబ్బో! కర్ణునివంటి దాతవు" అనుమాట ధర్మప్పారాయని రాజధానిలో వినబడదు. బిచ్చగాండ్రు రాజసౌధపు పంచాదులలో నిరాఘాటముగ సంచరించుచుండిరి. రాజొకప్పుడును ఎవ్వరి నేమియు ననడు.

రాజు యొక్క ఈ కీర్తి పాంచాలము వరకు వ్యాపించినది. ఇరువురు "పార్శీ" భిక్షుక దంపతులు బహు ప్రయాసపడి వచ్చి నూజివీడు చేరిరి. హిందూస్థానీ పాటలో హాయి ఎక్కువ. అందులో నా దంపతుల గొంతులు మోహన సంగీతావతార ప్రథమ మూర్తులు. నూజివీడు, నూజివీడెల్ల నొద్దు విరిగిపోయినది.

ఆనాడు కోట యంతయు గాన వాహినులతో తడిసిపోయెను. ఆ మహోత్సవములో నొడలు తెలిసిన వారెవ్వరు!?

పూర్వపు భిక్షువులు రాజసౌధపు క్రింద పంచాదులలో నుందురు. వీరికి పై యంతస్తులో నివాస మేర్పరుపబడినది.

అసూర్యంపశ్య, బహిరవిక్షిప్త పద పంకజ–రాజుగారి దేవేరి, స్వయముగా వచ్చి యా బిచ్చపు దంపతుల పరామృశించినది. ఆ రాజసౌధపు నీడతోడనే యా భిక్షువుల మీద నిందిరా సుందరీ కృపావిలోకన ద్యుతులు వ్యాపించినవి.

మఱునాడు రాజకార్యము మీద అప్పారావుగారు అమరావతికి వెళ్ళవలసి వచ్చినది. కృష్ణవేణి మందహాసములలో తన కీర్తులు కలగలుపుకున్న వాసిరెడ్డి వేంకటాద్రి నాయనింగారికిని, అప్పారావుగారికిని త్రెంచరాని నెయ్యము. తాను వచ్చువరకు తగిన శ్రద్ధ తీసికొనుటకు భిక్షుక దంపతులు మంత్రి యధీనము చేయబడిరి.

రాజున కారు మాసముల వరకు రా వీలు కలుగలేదు. ఇంటికడ మాత్రము వీరిరువురకును రాజభోగము. ఎన్నడెరుగని మెత్తని పరుపులపై పవ్వళింపు!

రుచుల రుచుల పోపుకూరల యారగింపు!! తాల్చునవి తెల్లని యుడుపులు. ఆరు నెలలు గడచునప్పటికి మున్ను వానలేని సస్యములవలె పేదవడియున్నవారి మేనులు, చివురించి నేవళము తేలి స్థూలములైనవి. వారి సన్నని గొంతులు ముద్దబారినవి.

రాజువచ్చినాడు. ఆనాడు సాయంతనమున భిక్షుకులు పిలువబడిరి. రాజు గుర్తుపట్టలేక పోయెను. వారు కూడ మునుపటి యంత దైన్యము, వినయము మరచిపోయినారేమో!

ఆ సంగీతము మీద నందరకు నేవగింపైనది. వినవచ్చిన యెల్లరు బొమముడి వైచిన వారె! రాజున కుత్సాహము చచ్చిపోయినది.

పెంపుడు దోసముచేత నా కోకిల జత తన సంగీతము మరచిపోయినది. దోషము చేతనే యా జత పంజరము నుండి విడువబడినదియును.

తన పూర్వపు ప్రజ్ఞ విస్మృతి పొందిన యా జతకు పొట్ట జరుగలేదు. గ్రీష్మాతపమున వడగొట్టి యొక చెట్టుక్రింద జంటగా నొకదాని చేయి యొకటి పుచ్చుకొని, యది కాలగర్భమున నంతరించినది.